# కొండ మీద ప్రసంగానికి ఉపోద్ఘాతం

## Introduction to the Sermon on the Mount

### పాఠం

మత్తయి సువార్త 5వ అధ్యాయం నుండి 7వ అధ్యాయం వరకు ఉన్న కొండ మీద ప్రసంగంలో యేసుక్రీస్తు కొన్ని జీవ నియమాలను తెలియజేసాడు. ఈ నియమాలు ఈ అంత్యదినాలలో ఉన్న మానవాళి కోసం దేవుని క్రొత్త నిబంధన నియమాలైయున్నవి (హెబ్రీ. 8:10; 2 తిమోతి 3:1). దేవుని వాక్యాన్ని విని ఆయన రాజ్యమందు విశ్వాసముంచిన తర్వాత మారుమనస్సు పొందిన ప్రజల హృదయాలపై మరియు మనస్సులపై వ్రాయబడటానికి (ముద్రించబడుటకు) ఈ నియమాలు రూపొందింప బడియున్నవి (మత్తయి 4:17,23). క్రైస్తవులు వారు తమ మారుమనస్సు నందు క్రొత్త నిబంధనను అంగీకరించారు (లూకా 3:8; 13:3). వారి పాపముల విమోచన నిమిత్తమై వారు బాప్తిస్మాన్ని కూడా పొందారు (అపొ. కార్య. 22:16). మారు మనస్సు పొందిన విశ్వాసి యొక్క పాపాలను ఆయన ఇక ఎన్నటికిని జ్ఞాపకం చేసుకోడని యేసురక్తం ద్వారా వచ్చిన దేవుని క్రొత్త నిబంధన తెలియజేస్తుంది (మత్తయి 26:28; హెబ్రీ. 8:12). మేము తెలియజెప్పాలని ఆశిస్తున్న విషయం ఏమిటంటే కొండ మీద యేసు చేసిన ప్రసంగాన్ని లోకంలో ఉన్న ప్రజలందరూ చదివి అభినందించగలరు; కాని, యేసురక్తం చేత కడుగబడి పరిశుద్ధంగా ఉంచబడిన హృదయాలపై మరియు మనస్సులపై మాత్రమే జీవ నియమము వ్రాయబడగలదు.

*కాబట్టి యిప్పుడు క్రీస్తుయేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు. క్రీస్తుయేసునందు జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమము పాపమరణముల నియమము నుండి నన్ను విడిపించెను. రోమా 8:1,2.*

తిరిగి జన్మించిన ప్రజలు మాత్రమే కొండ మీద యేసుక్రీస్తు చేసిన ప్రసంగాన్ని తమ "స్వభావము"లకు అన్వయించుకోగలరని చెప్పటానికి కొన్ని కారణాలున్నాయి. మత్తయి 5:48లో "మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు" అని యేసు చెప్పిన మాట సరిపోతుంది. అయినప్పటికిని ఇక్కడ మూడు కారణాలున్నాయి:

1. జీవ నియమానికి మరియు మోషే ధర్మశాస్త్రానికి మధ్య గుణంలోను మరియు ఉద్దేశంలోను పూర్తిగా వ్యత్యాసం వుంది. జీవ నియమము శిక్షించదు, నిత్యజీవం కలిగేలా ఇది జీవమును వివరిస్తుంది.
2. ఒక వ్యక్తి యొక్క హృదయంపై మరియు మనస్సుపై జీవ నియమాలు (laws of life) ముద్రింపబడాలంటే, ఆ హృదయం మరియు ఆ మనస్సు విడుదల కలిగినదై యుండాలి. ఆ వ్యక్తి మరణం నుండి తప్పక విడుదల పొందినవాడై యుండాలి; అంటే, ఆ వ్యక్తి దేవునితో సహవాసాన్ని కలిగియుండాలి. ఆయన వెలుగులో ఉన్న ప్రకారం ఆ వ్యక్తి కూడా వెలుగులో నడవాలి (1 యోహాను 1:7). ఆ వ్యక్తి పాపం నుండి తప్పక విడుదల పొందినవాడైయుండాలి. అనుదినం దోషారోపణ నుండి సంపూర్ణమైన విడుదల కలిగియుండాలి. అవమాన భారం పోవటానికి, యేసుక్రీస్తు రక్తమందలి విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడాలి (రోమా 3:21-26; హెబ్రీ. 10:1-3).
3. యేసు -తాను పరలోకం నుండి పరిపాలించునని మరియు భూమి మీద పరిశుద్ధాత్మ, దైవత్వంలో ముఖ్యమైన వ్యక్తిగా ఉండుననే ఆలోచనతో దేవుని రాజ్యాన్ని బోధించాడు. క్రైస్తవులు పరిశుద్ధపరచబడుటకు పరిశుద్ధాత్మ వారిని నడిపించును (2 థెస్స. 2:13). దీనిని అర్థం చేసుకోవడానికి రోమా పత్రిక ఎనిమిదో అధ్యాయాన్ని మరియు ఇతర సంబంధిత లేఖనాలను చదవండి.

దేవుని రాజ్యమందున్న నిత్యజీవమునకు సంబంధించిన సందర్భంలో యేసు జీవ నియమములను బోధించాడు. అన్ని రాజ్యాల పౌరులు ఒక జీవిత నాణ్యతను కలిగియుంటారు. అయితే ఈ నాణ్యత అనేది ఒక ప్రత్యేక రాజ్యం యొక్క సంస్కృతిలో కనుపరచబడుతుంది. సాతాను రాజ్యంలో చీకటి సంస్కృతి మరియు చెడు సంస్కృతి ఉన్నాయి (అపొ. కార్య. 26:18; ఎఫెసీ. 2:1-3). దేవుని రాజ్యము లేకుండా జీవిస్తున్న కాలమే "ప్రస్తుతపు దుష్టకాలము" అని ఉదహరించబడింది. గలతీ. 1:4. ఒక క్రైస్తవునిలో నిత్యజీవం యొక్క నాణ్యతను మరియు అభివృద్ధిని వివరించే జీవ నియమాలను యేసు బోధించి వాటి ప్రకారం ఆయన జీవించాడు (యోహాను 1:4; 1 యోహాను 1:1-4; గలతీ. 6:2). ఈ పాఠాల క్రమంలో మనం చేయబోయే యేసు ప్రసంగ అభ్యాసం వలన, దేవుని రాజ్యమందలి జీవిత నాణ్యతను మనం అర్థం చేసుకోగలం. క్రైస్తవుని వ్యక్తిత్వంలో ఈ జీవిత నాణ్యత దానికదే బయలుపరచబడుతుంది. సాతాను యొక్క చీకటిమయ లోకానికి మరియు నాశనమగు లోకానికి ఒక క్రైస్తవుని వ్యక్తిత్వం మరియు గుణం దేవుని యొక్క "ఉప్పు మరియు వెలుగు"వలె ఉంటాయి (మత్తయి 5:13-16). "క్రీస్తునందు" ప్రతి క్రైస్తవునికి ఇది కూడా గురియై వుంది.

పాత నిబంధన క్రింద ఇంకను నివసిస్తున్న యూదా ప్రజలే కొండ మీద యేసు బోధించిన ప్రసంగానికి సందర్భమైయున్నారు (హెబ్రీ. 8:7,13). లూకా తన సువార్తలో కొండ మీద ప్రసంగము యొక్క భాగాలను వివిధ అన్వయింపులలో వాడియున్నాడు. కాని మత్తయి ఈ ప్రసంగమంతటిని కొనసాగింపుగా ఒకే చోట ఉంచాడు. "ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములనైనను కొట్టివేయ వచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు" అని యూదులతో యేసు చెప్పాడు (మత్తయి 5:17). యేసు చేసిన మౌఖిక బోధకు ఇశ్రాయేలీయులు

సందర్భమైనప్పటికిని మత్తయి వ్రాసిన సువార్తకు క్రైస్తవుల హృదయాలు మరియు మనస్సులు సందర్భమై యున్నవి. ఈ పరిస్థితిలో, క్రైస్తవులు ధర్మశాస్త్రం యొక్క విధులను నెరవేర్చవలసిన వారైయున్నారు. అది ఎలా అనేది ఈ పాఠాల వరుసలో కనబడుతుంది. మోషే ధర్మశాస్త్రము మరియు "జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమము" అను వాటి మధ్య ఉన్న తేడాను మనం అర్థం చేసుకుంటాం.

కొంతమంది, యేసు ప్రసంగంలోని ప్రారంభ భాగాన్ని ధన్యతలుగా సూచించారు (మత్తయి 5:3-10). క్రైస్తవుల హృదయాలలో మరియు మనస్సులలో అవి ధన్యతలు (beatitudes) గా ఉండిన తర్వాత "చేయాల్సిన వైఖరులు" (do-attitudes) గా మారతాయి (మత్తయి 7:24). కొన్ని ఆరోగ్యకరమైన వైఖరులను గూర్చి యేసు చేసిన బోధలు క్రైస్తవ వ్యక్తిత్వానికి సంబంధించినవై యుండగా మన వ్యక్తిత్వం ఎలా అభివృద్ధి చెందుతుందో మనం తప్పక అర్థం చేసుకోవాలి. వ్యక్తిత్వ అభివృద్ధికి సంబంధించిన సాధారణ ప్రక్రియలు క్రింద ఉన్నాయి :

ఎ. మొదటిగా, నూతనంగా పుట్టిన ప్రతి శిశువు యొక్క సృష్టి నిమిత్తం దేవుని రూపకల్పనను గూర్చి మనం తెలుసుకున్నవారమై వుండాలి. ప్రతి మనుష్యుని ఆత్మ దేవుని నుండి వచ్చెను మరియు వారి శరీరాలు భూమి నుండి వచ్చాయి (ఆది. 2:7; ప్రసంగి 12:7; అపొ. కార్య. 17:26). ఆత్మకును శరీరానికిని సామర్థ్యాలు మరియు అవసరతలు అనేవి స్వాభావిక లక్షణాలుగా చేర్చబడ్డాయి. ఇవన్నియు ప్రజలలో అనేక రకాల వ్యక్తిత్వాలను, గుణలక్షణాలను ప్రభావితం చేస్తాయి. ఈ క్రింద ఉన్న విషయాలు క్రొత్తగా జన్మించిన శిశువుతో పాటు వస్తాయి:

1. విభిన్నమైన బుద్ధి. ప్రతి కోణంలో సమానంగా మనం సృష్టించబడి ఉండవచ్చు లేదా లేకపోవచ్చు. ప్రజలు వివిధ రకాలైన బుద్ధిని కలిగియున్నారని మనకు తెలుసు.
2. భౌతిక లక్షణాలు స్వాభావికమైనవి: రంగు, రూపం, తలకట్టు మరియు వగైరా.
3. ఆహారం, భద్రత, లైంగిక వాంఛ, సాంఘీక అంగీకారం, సాధించుట మరియు మహిమ కొరకైన మన అవసరతలు గాని అక్కరలు గాని మనలోనే నిర్మితమయ్యాయి. మనం వీటిని నేర్చుకోవాల్సిన అవసరత లేదు. ప్రతి ఒక్కరూ వీటితో పాటే జన్మించారు.
4. ఒక శిశువు ఆయా సామర్థ్యాలతో జన్మించును. ఎన్నుకోవడానికి, ఊహించు కోవడానికి మరియు క్రియ చేయడానికి వారు సామర్థ్యాన్ని, స్వేచ్ఛను కలిగియున్నారు. వారు పరిపక్వత చెందినప్పుడు వారి మనస్సాక్షి పని చేస్తుందనుటకు ఆధారం వుంది. తమ్మును తాము పరీక్షించుకోవడానికి దేవుని చేత ఇవ్వబడిన సామర్థ్యాన్ని వారు కలిగియున్నారు. అన్ని సమయాలలో అన్ని చోట్ల ప్రజలందరూ ఈ లక్షణాలను కలిగియుండటాన్ని బట్టి -అవి స్వాభావిక మైనవనీ, మానవాళి రూపకల్పనలో దేవుడే వాటిని ఉంచాడనీ మనం చెప్పవచ్చు.

బి. పైన చెప్పబడిన స్వాభావిక లక్షణాలు -ఒక వ్యక్తి వలె అతడు లేదా ఆమె తమ చుట్టూ ఉన్న పరిస్థితులను వారు ఎదుర్కోవడానికి తమకు తాముగా భావాలను వ్యక్తీకరించేలా చేస్తాయి. ఈ లోకం, ప్రజలు ప్రతిస్పందించేలా చేసే ప్రేరేపణను ఇస్తుంది. అది మానవుని స్వాభావిక సామర్థ్యాలను ప్రేరేపిస్తుంది కాని అవసరతలను తీర్చవచ్చు, తీర్చకపోవచ్చు. మన వివిధ సామర్థ్యాలు వాటికవే వ్యక్తమవ్వడానికి అవకాశం వుంది. మన అవసరతలు గాని అక్కరలు గాని గట్టిగా కోరుకునేది తృప్తిపరచబడటమే. ఇది ఒక వ్యక్తి ఏకైక వ్యక్తిత్వాన్ని అభివృద్ధిపరిచే ప్రక్రియలలో ఒక కార్యమై వుంది.

ఒక వ్యక్తి యొక్క ఏకైక పరిస్థితిని బట్టి ప్రేరేపింపబడిన అవసరతలతో పాటుగా భౌతిక సామర్థ్యాలైనటువంటి స్వాభావికమైన తెలివితేటలు మరియు ఆయా ఇతర గుణాలు **పుట్టుకతో పాటుగా వచ్చిన పరికరం** వంటివి. వారి శక్తి సామర్థ్యాలలో ఉన్న భేదాన్ని బట్టి, వారు ఎదుర్కొన్న పరిస్థితిలో వ్యత్యాసాలను బట్టి ఇది ఖచ్చితంగా వ్యక్తి నుండి వ్యక్తికి తేడాను కనుపరుస్తుంది. ఒక కుటుంబంలో ఉన్న కొంత మంది పిల్లల అవసరతలు తీర్చబడకపోయి వుండవచ్చు; కాబట్టి భయము, కోపము అనేటటువంటి వ్యక్తిత్వ గుణ లక్షణాలు వృద్ధికావచ్చు. స్నేహ భావంతో లోకాన్ని చూసేవారు ప్రేమ, విశ్వాసం అనేటటువంటి వాటిని వృద్ధి చేసుకుంటారు. తమ స్థితిగతులలో సహాయాన్ని పొందనివారు స్నేహ భావం లేని పరిస్థితిలో సహితం సంతృప్తిని పొందటానికి తమ ప్రవర్తనను సరి చేసుకుంటారు. ఆ రీతిగా వారు స్థితిగతులకు తగ్గట్లుగా తమ సరియైన ప్రవర్తనను ఉపయోగిస్తారు. అందుచేత సంతోషకరమైన వ్యక్తిత్వ లక్షణాలను వారు కలిగియుంటారు. వారి ప్రవర్తన కొరకైన తమ నిర్ణయాలు, ఫలితాల్ని బట్టి కాక సూత్రాల్ని (principles) ఆధారం చేసుకున్నవై యున్నాయి (కీర్తన 37:23,24). మన జీవితాలలో మనం సరియైన ప్రవర్తన కలిగి జీవించడానికి దేవుడు మనకు సూత్రాలను బోధిస్తాడు.

సి. వ్యక్తిత్వంలోని అభివృద్ధి చెందే దశలలో ఒకని ప్రవర్తన గొప్ప ప్రాముఖ్యత గల విషయమై వుంది. కోరికలను, అక్కరలను తీర్చుకోవడానికి ప్రవర్తన అనేది ఒక యత్నమై (effort) వుంది. సంతృప్తి పొందటం వలన కలిగే ఫలితం ఆహ్లాదమై వుంది (pleasure). ఒక వ్యక్తి లోకాన్ని చూసే తీరు, అతడు సంతృప్తి చెందు తున్నాడా లేదా అనే దాని చేత కొలవబడుతుంది. మన అవసరతలను గూర్చి యేసుకు తెలుసు. ఆయన రాజ్యాన్ని వెదకడానికై ప్రాధాన్యతనిచ్చే వారి అవసరతల కోసం తండ్రియైన దేవుడు ఏర్పాట్లు చేస్తున్నాడు (మత్తయి 6:25-34). మన స్వాభావిక అవసరతల కొరకు దేవుడు "క్రీస్తునందు" ఒక కార్యక్రమాన్ని కలిగియున్నాడు గనుక క్రైస్తవులు ఆయనను ప్రేమించటం నేర్చుకోవాలి; అయినా, యేసు రాకడలో ఉన్న మన నిరీక్షణను బట్టి మాత్రమే కొన్ని అవసరతలు తీర్చబడతాయి.

డి. తన అవసరతను తీర్చుకునే పనిలో అసంతృప్తి కన్పించే వరకు ఒక వ్యక్తిలోని ఉద్రేకాలు నిద్రావస్థలో ఉంటాయి. అసంతృప్తి కనిపించినప్పుడు ఉద్రేకాలు బయటికొస్తాయి. వారికి ఆకలి కలిగినప్పుడు ఆహారం లేకపోతే భయం అనే ఉద్రేకానికి వారు లోనవుతారు. ఆహారం పొందకుండా వారిని, ఎవరైనా ఆటంకపరిస్తే కోపం అనే ఉద్రేకం నిద్ర లేస్తుంది. తమ అవసరతలను తీర్చే వ్యక్తిని ప్రజలు తప్పక ప్రేమిస్తారు. ఈ ప్రతిచర్యలే ఉద్రేక వైఖరులని పిలువ బడతాయి. **ఉద్రేక వైఖరులు అనేవి వ్యక్తిత్వంలో పనిచేసే మూలకాలైయున్నవి.** ఒక వ్యక్తి ఆరోగ్యకర వ్యక్తిత్వాన్ని కలిగియున్నప్పుడు వచ్చే ఫలితం -సంతోషం; కాబట్టి ఆరోగ్యకరమైన ఉద్రేకాలను కలిగియుండటం ప్రజలకెంతో ప్రాముఖ్యం.

మానవాళిని దేవుడు సృజించిన విధానంలో మానవ వ్యక్తిత్వంలోని అభివృద్ధి ఎలాంటి మూలాలను (roots) కలిగియుందో మనం నేర్చుకున్నాం. ఒక వ్యక్తి యొక్క ప్రస్తుత వ్యక్తిత్వంలోని అభివృద్ధికి కొన్ని విభిన్న గుణాలు (variables) మార్పును కలిగించాయి. ప్రభువు మనకనుగ్రహించిన సామర్థ్యాల పరిమాణమే ఒక విభిన్నమైన గుణం. ఒక వ్యక్తి జీవితం యొక్క తొలి దినాలలో అతడు/ఆమె జన్మించి, జీవించిన పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితియైన వారి "స్వభావం" పై గొప్ప ప్రభావాన్ని చూపిస్తాయి. సమయానికి తగ్గ అవసరతను తీర్చుకోవడానికి అతడు/ఆమె ఉపయోగించే ప్రవర్తనే నియంత్రించే భాగమై వుంది.

దయచేసి గమనించండి; దేవుడు మనల్ని ఉంచిన విధానాన్ని మనం **మార్చలేము**. మనం వున్న స్థితిగతులను మార్చటానికి మనకు సామర్థ్యం లేకపోవచ్చు; అయిననూ, స్థితిగతులను కలిగించు ప్రజల విషయమై మరియు స్థితిగతులను కలిగించు మూలకాల విషయమై మన ప్రతిస్పందనను మార్చుకోగలం. స్థితిగతులకు మనం ప్రతిస్పందించు విధానమే **మనం నేర్చుకునే స్థలం.** మన అవసరతను తీర్చుకోవడానికి సంతృప్తిని ఇచ్చే సరియైన ప్రవర్తనను మనం నేర్చుకోవాలని ప్రయత్నిస్తాం. కొన్ని సార్లు మనం నిరీక్షణతో వేచియుండాల్సిన అవసరత ఉంటుంది. మిగిలిన సమయాలలో మనం ప్రవర్తనను మార్చుకోవాల్సిన అవసరత ఉంటుంది. మన ప్రవర్తన చేత సంతృప్తి అనేది కొనసాగించేదిగా సాధించబడినప్పుడు ఈ ప్రవర్తనను మన అలవాటుగా చేసుకుంటాం. "మార్గము, సత్యము, జీవము" అనే దానిలో ఒక భాగాన్ని కొండ మీద ప్రసంగంలో యేసు మనకు అనుగ్రహించాడు (యోహాను 14:6; మత్తయి 7:24).

ఎనిమిది ఆరోగ్యకర ఉద్రేకాల జాబితాను యేసు మనకిచ్చాడు. వాటిని విశ్వాసంతో స్వీకరించి, చూపిన విశ్వాసం పట్ల విధేయత గల వారి కోసం సంతోషము మరియు ఇంకా ఇతర యోగ్యమైన మంచి విషయాలు వున్నాయి. మనం సంతోషాన్ని వెదకము. యేసు బోధలకు మనం గనుక విధేయులమైతే సంతోషము తప్పకుండా మన వెంబడి వస్తుంది. కొండ మీద ప్రసంగంలో ప్రజలకు సరియైన ప్రవర్తనను గూర్చి యేసు బోధించాడు. ఈ పాఠాల వరుసలో మనం ఆ బోధలన్నిటిని వివరంగా అభ్యసిస్తాం. మనం సంతోషంగా ఉండి బలమైన గుణాన్ని కలిగియుండాలని కోరుకుందాం. మనం బలవంతులుగాను, సంతోషంగాను ఉండాలని యేసు కోరుతున్నాడు. దేవుడు మనలో సృజించిన అవసరతలను తీర్చడానికి "క్రీస్తునందు" అనే పరిసరం అనుకూలమైనది. "క్రీస్తునందు" అనే ఈ పరిసరాన్ని సిలువలోని కృపచేత మనం స్వాధీనపరచుకోగలం. ఇది క్రైస్తవుల కోసం సిద్ధపరచబడుతూ ఉంది గనుక మనం యేసుక్రీస్తు వంటి సంతోషకరమైన క్రైస్తవ వ్యక్తిత్వాన్ని వృద్ధి చేసుకోగలం.

## సారాంశం

ఈ పాఠంలో ఇంతకు ముందు చెప్పబడిన విషయాలను అర్థం చేసుకోవడం ప్రాముఖ్యము గనుక ఈ సారాంశం చేర్చబడింది. గలిలయలో ఒక కొండ మీద యేసు చేసిన గొప్ప ప్రసంగాన్ని మనం అభ్యాసం చేయుచుండగా మనం ఆలోచించ వలసిన అనేక విషయాలున్నాయి. వాటిలో ఒకటి దేవుని రాజ్యము, ఎందుకంటే యేసు బోధలన్నియు దేవుని రాజ్యాన్ని గూర్చిన శుభవార్తలైయున్నవి. దేవుని రాజ్యంలో క్రైస్తవులు ఆయన పిల్లలుగా ఉండాలని ఆయన బోధించాడు (మత్తయి 4:17). పరలోకంలో తన నిత్యరాజ్యమందు ఈ పిల్లలను దేవునితో ఉంచడానికి యేసు పరిపాలిస్తాడు (అపొ. కార్య. 2:36; 1 కొరింథీ 15:24; హెబ్రీ 2:10 ).

మనం ఆలోచించాల్సిన మరొక విషయమేమిటంటే మన జీవితాలలో ప్రస్తుతం మనం ఏమైయున్నామో ఆ వ్యక్తిత్వం మనకెలా వచ్చింది? యేసు ప్రసంగంలోని మొదటి భాగంలో ఎనిమిది ఆరోగ్యకరమైన ఉద్రేక వైఖరుల జాబితా ఉంది. ఉద్రేక వైఖరి అనేది వ్యక్తిత్వంలో కార్యరూపం దాల్చే మూలకమై వుంది. ఒక వ్యక్తి అభివృద్ధిపరచుకునే ఉద్రేక వైఖరులపై వ్యక్తిత్వ విధానం, గుణంలోని శైలి మరియు మనస్సు యొక్క ఆరోగ్యము అనేవి ఆధారపడి వుంటాయి. ఈ కారణాన్ని బట్టి దేవుని పిల్లల కోసం ఎనిమిది ఆరోగ్యకరమైన ఉద్రేక వైఖరుల ప్రస్తావనతో ఆయన తన ప్రసంగాన్ని ఎందుకు ప్రారంభించాడో మనం అర్థం చేసుకోగలం. మత్తయి తన సువార్తలో యేసు ప్రసంగాన్ని నమోదు చేసియుండగా దానిలో మానవాళి కొరకైన జీవిత సూత్రములు/ జీవ నియమములు ఉన్నాయి. యేసు తిరిగి వచ్చేటప్పుడు తన తండ్రి యొద్దకు ఆయన తీసుకురావాలని తలస్తున్న పిల్లలపై ఈ నియమాలు వ్రాయబడుతూ ఉన్నాయి (హెబ్రీ. 2:10,11). ఈ రకమైన చట్టము/నియమము దేవుని కుమారునిగా అభివృద్ధి చెందే పరిస్థితిని వివరిస్తుంది (రోమా 8:16).

మనం ఈ ప్రసంగ అభ్యాసాన్ని ప్రారంభించక మునుపు మనం అర్థం చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే, మనం కలిగియున్న ఉద్రేక వైఖరులు ఎలా అభివృద్ధి చెందాయో మనం తప్పక

గ్రహించాలి. ఇప్పుడున్న మన ప్రస్తుత వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసిన ఉద్రేక వైఖరులతో మనం జన్మించియుండలేదు. అయితే ప్రశ్న ఏమిటంటే మనం వాటిని ఎలా పొందాము? మనం ఇప్పుడున్న స్థితికి ఎలా వచ్చాం? ఈ ప్రశ్నకు జవాబు ఇవ్వడానికి ఈ పాఠంలో పై భాగమందు ఒక ప్రయత్నం జరిగింది. ఇక్కడ ఇవ్వబడుచున్న సమాచారంలో చాలా వరకు, మానవాళిని గూర్చి వివిధ పండితులు వ్రాసిన అభ్యాసాల నుండి ఎన్నుకోబడింది.

మన ఉద్రేక వైఖరులు ఎలా అభివృద్ధి చెందాయో అర్థం చేసుకోవడం మనకు చాలా ప్రాముఖ్యం. యేసు బోధించిన ఆరోగ్యకరమైన వైఖరులకు మనం కలిగియున్న వైఖరులు జతచేయబడవు అనే ప్రక్రియను తిరిగి నేర్చుకోవడానికి ముందు మనం దీనిని తెలుసుకోవాలి. ఆయన ఈ ప్రసంగంలో బోధించింది చాలావరకు క్రొత్త నిబంధనలో చెప్పబడిన జీవ నియమములైయున్నవి (హెబ్రీ. 8:10-12). అవి క్రైస్తవ అభివృద్ధి ప్రక్రియను వివరిస్తాయి. కాబట్టి, జీవ నియమాలను గూర్చిన సరైన అవగాహనతో మన అభ్యాసాన్ని ప్రారంభించటం చాలా అవసరం. దేవుని కుమారుల వలె మనమెలా అభివృద్ధి చెందాలో అవి వివరిస్తాయి.

దేవుడు మనలో సృష్టించిన అవసరతలను మరియు అక్కరలను తీర్చుకోవడానికి మనం సంతృప్తిని వెదకుచుండగా మన ప్రస్తుత ఉద్రేక వైఖరులే మన వ్యక్తిత్వాన్ని తయారు చేసాయని నేర్చుకున్నాం. దీనితో పాటుగా సాధకము (practice) చేయాలని మనం కోరుచున్న ఆయా సామర్థ్యాలతో మనం జన్మించియున్నాం. నిజానికి, ఇవన్నియు (పుట్టుకతో పాటుగా వచ్చిన పరికరం) మనం పుట్టినప్పటి నుండి నివసిస్తున్న పరిసరాలలో సంతృప్తిని వెదికాయి. మనం మన పరిసరంలో ప్రతిస్పందించి ప్రవర్తిస్తాము. మన అవసరతల కోసం మనం సంతృప్తిని వెదకుతాము. ఈ పరిస్థితిలోనే ఇప్పుడు మనం కలిగియున్న వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకొనియున్నాం.

దేవుడు మనల్ని చేసిన విధానాన్ని మనం మార్చలేము. మన ఉద్రేకాలు అభివృద్ధి కాకుండా మనల్ని మనం కాపాడుకోలేము. మనం మన పరిసరాన్ని మార్చుకోవచ్చు లేదా మార్చుకోకపోవచ్చు. ఏది ఏమైనా, మనం తప్పక లోకంలో జీవించాలి. అయితే మనం మార్చుకోగలది ఏమిటంటే మనం నివసిస్తున్న ఈ లోకంలో మనమెదుర్కొను ప్రేరేపణ పట్ల ఉన్న మన ప్రతిస్పందనను గాని ప్రవర్తనను గాని మార్చుకోగలం.

యేసు యొక్క ప్రసంగం చివరిలో ఆయన చెప్పిన దానిని దయచేసి గమనించండి, "కాబట్టి యీ నా మాటలు విని వాటిచొప్పున **చేయు ప్రతివాడును** బండ మీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును." మత్తయి 7:24. **చేయుట** అనే పదం మన ప్రవర్తనను, ప్రతిస్పందనలను మరియు మన పరిసరంలో మన స్వాభావిక అవసరతలను తీర్చుకోవడానికి మనం ప్రదర్శించే అలవాట్లను సూచిస్తుంది.

యేసు తన ప్రసంగ ప్రారంభంలోనే సరియైన ఉద్రేకాలను గూర్చి మనకు బోధించాడు. మన పరిసరం పట్ల మనం చూపించాల్సిన సరియైన ప్రతిస్పందన (సాధకము చేయుట, ప్రవర్తన)ను గూర్చి కూడా ఆయన ప్రసంగమంతటిలోను బోధించాడు.

## చర్చ కోసం ప్రశ్నలు

1. కొండ మీద ప్రసంగం యొక్క **అన్వయింపు,** ఒక వ్యక్తి క్రైస్తవుడై యుండాలని ఎందుకు కోరుతుంది?
2. క్రైస్తవులుగా మన వ్యక్తిత్వంలోని ఆరోగ్యకరమైన లక్షణాలను అభివృద్ధి చేసుకోవడానికి సహాయపడే దేవుని క్రొత్త నిబంధనలో గల రెండు ఆసక్తి దాయకమైన విషయాలను పేర్కొనండి.
3. ఆరోగ్యకర ఉద్రేకాలను అభివృద్ధి పరచుకోవడానికి ప్రజలు వెదికే మార్గాలలో ఎందుకని కొన్ని వ్యత్యాసాలుండవచ్చు?
4. వ్యక్తిత్వం యొక్క అభివృద్ధిలో ఒకని ప్రవర్తన ఎలాంటి మూలకమై వుంది?
5. ఉద్రేకం ఎప్పుడు బయటికొస్తుంది?
6. ఒక వ్యక్తి సంతోష భావాన్ని ఎప్పుడు అనుభవించగలడు?
7. మన వ్యక్తిగత సంతోషం కొరకైన మన నిరీక్షణకు కొండ మీద యేసు చేసిన ప్రసంగం ఎలా సహకరిస్తుంది?
8. వ్యక్తిత్వ అభివృద్ధి ప్రక్రియలలో స్వాభావికమైన మూలకాలను మరియు నేర్చుకునే మూలకాలను పేర్కొనండి.
9. ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని మార్చుకోగలడా? ఒకవేళ మార్చుకోగలడు అంటే అది ఎలా?
10. సంతోషం అనేది ఒకని జీవితం కొరకైన గురిగా ఎందుకని వెదకబడటం లేదు?